జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి
- సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌ల ప్రారంభం


మడుగుపల్లిలో ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వీరాంజనేయులు, జెడ్పీటీసీ సువర్ణ తదితరులు

పుట్లూరు: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం మండలంలోని మడుగుపల్లి, ఎల్లుట్ల గ్రామాల్లో గ్రామ సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆమె వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఎం.వీరాంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్న ఊళ్లో ప్రభుత్వ సేవలను అందించడానికి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి జగనన్న గ్రామ స్వరాజ్యానికి నాంది పలికారన్నారు. సిఫార్సు చూసి ప్రభుత్వ పథకాలను అరకొరగా ఇచ్చే గత టీడీపీ ప్రభుత్వానికి అర్హతను చూసి అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందించే జగనన్న ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలు గమనించారని, మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవడానికి వారు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఒకప్పుడు ప్రతి చిన్నపనికి మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం గ్రామ సచివాలయాల ద్వారా అన్ని ప్రభుత్వ సేవలను గ్రామాల్లోనే అందిస్తున్నారన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామ సచివాలయం, రైతు భరోసా, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పిదప సువర్ణ, నాటక అకాడమీ చైర్ పర్సన్ ప్రమీల, సర్పంచ్‌లు గుర్రమ్మ, లక్ష్మిదేవి, ఎంపీటీసీ లక్ష్మిదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరామిరెడ్డి, గోపాల్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, కంచెం శ్రీనివాసరెడ్డి, లగినేని శేఖర్, బాలరాజు, రాజు రాయల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెద్దవడుగూరు ఎస్‌ఐగా శ్రీనివాసులు



పెద్దవడుగూరు : స్థానిక ఎస్‌ఐగా ఎం.శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈవీఎంలపై అవగాహన

బుక్కరాయసముద్రం: బొమ్మలాటపల్లి, చెన్నంపల్లి, దయ్యాలకుంటపల్లి, వెంకటాపురం, కేకే అగ్రహారం, సంజీవపురం, రేకులకుంట, అమ్మవారిపేటలో మంగళవారం అధికారులు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఈవీఎం ద్వారా ఎలా ఓటు వేయాలో ప్రత్యక్షంగా చూపించారు. ఈఓఆర్డీ దామోదరమ్మ, వీఆర్‌ఓలు జవహర్ బాషా, రాధా, రాంబాబు, కార్యదర్శి రియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం


నెట్టికంటుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం వందలాది మంది భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సమీపంలోని గంగా నిలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం వందలాది మంది భక్తులతో కలిసి హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుడు లోకనాథ్‌శర్మ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాన్ని ఈఓ విజయ్‌సాగర్‌బాబు ప్రారంభించారు.

ఎస్‌ఆర్‌ఐటీ ప్రొఫెసర్‌కు సన్మానం


ఆంజనేయులును సన్మానిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఐఅండ్‌ఈడీపీ) సెల్ కన్వీనర్ డాక్టర్ ఆంజనేయులును కళాశాల యాజమాన్యం సన్మానించింది. ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈనెల 23న గుంటూరు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో కళాశాల థర్డ్ ఇయర్ విద్యార్థులు పూజిత, ధీరజ్, కృష్ణ, మిల్లెట్ బిస్కెట్ల ఉత్పత్తిపై నమూనాలు ప్రదర్శించారు. దీంత నిర్వాహకులు ఆంజనేయులుతో పాటు విద్యార్థులను సన్మానించారు. మంగళవారం కళాశాలలో వారిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, టీపీఓ రంజిత్‌రెడ్డి అభినందించి సత్కరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, సమన్వయకర్త వీరాంజనేయులు

శింగనమల: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుట్లూరు, యల్లనూరు, బుక్కరాయసముద్రం, నార్పల మండలాలకు చెందిన బాధిత కుటుంబాలకు రూ.10.39 లక్షలు విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం వారు బాధితుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం


తాడిపత్రి 30వ వార్డులో స్థానికులతో సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: కాలనీల్లో ఏవైనా సమస్యలుంటే తమకు చెప్పాలని, వెంటనే అధికారులతో చర్చించి వాటిని పరిష్కస్తామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 30 వార్డులో పర్యటించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి స్థానికులను ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగనన్నను మరోసారి సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కేశవరెడ్డి, పట్టణాధ్యక్షుడు మనోజ్, వక్ఫ్‌బోర్డు కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, నాయకులు పేరం ప్రతాప్‌రెడ్డి, ఆది తదితరులు ఉన్నారు.

తాడిపత్రిటౌన్: పులిప్రొద్దుటూరు, చుక్కలూరు గ్రామాల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును గ్రామస్తులతో అడిగి తెలుసుకున్నాడు. మరోసారి జగనన్నను సీఎంగా కొనసాగించుకుందామన్నారు. చంద్రబాబు హయాంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు పడిన ఇబ్బందులను గుర్తు చేశారు. మరోసారి వైఎస్సార్‌సీపీ ఓటు వేసి సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందామన్నారు. సర్పంచ్ హనుమంతరెడ్డి, ఎంపీటీసీ గంగిరెడ్డి, మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, నాయకులు వెంకటరంగారెడ్డి, నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఓబిరెడ్డి, రాజారెడ్డి, పోలమడ సత్యనారాయణరెడ్డి, రమేష్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, రాంబాబు, తలారి ప్రకాశం, శ్రీరంగా, రామచంద్ర, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యేల పర్యటన

తాడిపత్రి అర్బన్: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి బుధవారం ఉదయం పట్టణంలో పర్యటించనున్నారు. ఉదయం 10.30కు పెద్దపప్పూరు మండలంలోని చిన్నపప్పూరమ్మ ఆలయ పునః నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు అదే మండలం ఉప్పలపాడులో గ్రామ సచివాలయం, ఆర్బీకే భవనాలు, మధ్యాహ్నం 3.30కు చెర్లోపల్లిలో ప్రభుత్వ కార్యాలయాలను ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రారంభిచనున్నారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

బుక్కరాయసముద్రం: మండలంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బుధవారం పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు గోవిందపల్లిలో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్, డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. సాయంత్రం 4 గంటలకు సెంట్రల్ జైలు వద్ద తాడిపత్రి జాతీయ రహదారి నుంచి జంతలూరు వరకు డబుల్ లైన్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. 4.30 గంటలకు రెడ్డిపల్లిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్, ఆర్బీకే భవనాన్ని ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

పామిడి: రామరాజుపల్లి, పాళ్యంలో బుధవారం ఉదయం ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి పర్యటించనున్నారు. ఆయా గ్రామాల్లో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు, పాళ్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. కార్యక్రమాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరు కావాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో కోరాయి.

గాంధీజీ అడుగుజాడల్లో నడుద్దాం

గుత్తి: ప్రతి ఒక్కరూ గాంధీజీ అడుగుజాడల్లో నడుద్దామని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్‌బాబు మాట్లాడారు. భరత జాతికి స్వాతంత్ర్యం అందించిన మహనీయుడు గాంధీజీ అన్నారు. సత్యం, అహింసనే ఆయుధాలుగా మలిచిన గొప్ప వ్యక్తన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం కార్యదర్శి వెంకట్, కోశాధికారి ఎక్కల మహేష్, సీనియర్ నేత అలవల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యాడికి: దేశ స్వాతంత్ర్య సాధనలో గాంధీజీ పాత్ర కీలకమని ఆర్యవైశ్యం సంఘం మండలాధ్యక్షుడు జయవరం చంద్రశేఖర్ తెలిపారు. మహాత్మాగాంధీజీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదిత్య, విశ్వనాథ్, గాధం శెట్టి బలరామయ్య, బదిరి, రాజు, శ్రీహరి, మురళి, ప్రదీప్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

పామిడి: స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని ఓ వివాదాస్పద స్థలాన్ని అహుడా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ హరీష్ మంగళవారం పరిశీలించారు. ఎస్‌బీఐ కాలనీలోని ఓ ప్లాట్‌పై స్పందనలో స్థానికులు ఫిర్యాదు చేశారు. మంగళవారం కాలనీలో ప్లాట్‌ను పరిశీలించిన ఆయన స్థానికులతోపాటు ప్లాట్ యజమానులతో వివరాలు సేకరించారు. ఆయన వెంట ఈఓ చంద్రశేఖర్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శభాష్ ఆరోగ్య మిత్రా!

- 24 గంటల్లో ఆరోగ్య శ్రీ కార్డులో పేరు నమోదు


రాణికి మంజూరైన ఆరోగ్య శ్రీ కార్డు

గుత్తి: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆరోగ్య మిత్ర బాబు రాణి అనే బాలింతకు కేవలం 24 గంటల్లో ఆరోగ్యశ్రీ కార్డులో పేరు నమోదు చేయించాడు. దీంతో ఆసరా పథకం కింద లబ్ధి పొందింది. వివరాలు...పెద్దవడుగూరు మండలం బందార్లపల్లికి చెందిన రాణి అనే గర్భిణికి మంగళవారం పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు ఆమెను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు వెంటనే ప్రసవం చేశారు. అయితే ఆరోగ్య శ్రీ కార్డులో ఆమె లేకపోవడంతో ఆసరా పథకం వర్తించదని తెలుసుకున్న ఆరోగ్య మిత్ర వెంటనే సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌ను ఫోన్‌లో సంప్రదించాడు. వివరాలు తెలుసుకుని అధికారులకు పంపాడు. దీంతో వారు ఆరోగ్యశ్రీ కార్డులో రాణి పేరును నమోదు చేశారు. వెంటనే ఆరోగ్యశ్రీ ఆసరా కింద రూ. 5 వేలు మంజూరైంది. ఆరోగ్య మిత్రతో పాటు సిబ్బందికి, సీఎం వైఎస్ జగన్‌కు రాణి కృతజ్ఞతలు తెలిపింది.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో మెరుగైన వైద్యం


యాడికి మండలం నగరూరులో చిన్నారికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి

యాడికి: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా పేదలకు మెరుగైన వైద్యం ఉచితంగా అందుతోందని ఎంపీడీఓ లక్ష్మినారాయణ, ఎంఈఓ కాశెప్ప అన్నారు. నగరూరు గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో అందుతున్న వైద్య సేవలను ఎంపీడీఓ పరిశీలించారు. రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి దేవరాజన్ , అనంతపురం వైద్య నిపుణులు శ్రీనివాసుల రెడ్డి, మీనాక్షి 250 మందికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో 39 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు కంటి వైద్య నిపుణుడు మధుసూదన్‌రాజు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు రుక్మాంగదరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వసుంధర, డీలరు ఆదినారాయణ రెడ్డి, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని బాలాపురం గ్రామ సచివాలయలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. బాలాపురం, చింతలపల్లి, గోపురాజుపల్లి, వెంగన్నపల్లి, నారాయణపల్లి గ్రామాలకు చెందిన ప్రజలకు ప్రభుత్వ వైద్యురాలు శ్రీవాణి వైద్య పరీక్షలు చేయడంతోపాటు అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సజావుగా టెండర్ ప్రక్రియ


టెండర్లలో భాగంగా బహిరంగ వేలం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఏడాది పాటు నిర్వహించే వివిధ రకాల పనులకు మంగళవారం ఆలయ ఈఓ విజయసాగర్‌బాబు ఆధ్వర్యంలో షీల్డు, ఈటెండర్‌తోపాటు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ ఆలయంలో నిర్వహించే దాదాపు 23 రకాల పనులకు టెండర్లను ఆహ్వానించారు. ఇందులో కొన్నింటికి టెండర్‌లు దాఖలు కాగా, సింగిల్ టెండర్ దాఖలైన వాటిని వాయిదా వేశారు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే టెండర్‌ను కసాపురానికి చెందిన మద్దిలేటి రూ.18 లక్షలకు సొంతం చేసుకున్నాడు. వాహనాల టోల్‌గేట్ టెండర్‌ను అదే గ్రామానికి చెందిన హరిశ్చంద్ర రూ.6.4 లక్షలకు, భక్తులకు చాపలు, బెడ్‌షీట్స్ సరఫరా టెండర్‌ను కసాపురానికి చెందిన తులసి రూ.5.2 లక్షలకు, సెల్‌ఫోన్స్, కెమెరాలు భద్రపరిచే టెండర్‌ను రూ.5.5 లక్షలకు దక్కించుకున్నారు. బియ్యం బేడల సేకరణ టెండర్‌ను కిలో రూ.19 చొప్పున అహోబిలానికి చెందిన నాగశేషుడు అనే వ్యక్తి దక్కించుకున్నాడు. ఆలయ సిబ్బంది, పాలకమండలి సభ్యులు టెండర్ల నిర్వహణను పర్యవేక్షించారు.

సీపీఐ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, నాయకులు

యాడికి: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 20 కుటుంబాలు మంగళవారం సీపీఐ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సీపీఐ మండల మాజీ సహాయ కార్యదర్శి నబీరసూల్, నాయకులు రవితేజ, సాయిరెడ్డి, బయపురెడ్డి, మోహన్‌రెడ్డి, నీలావతి, రసూల్‌బీ, లక్ష్మీదేవి, రజక సుబ్బమ్మ, వి.లక్ష్మిదేవి, వడ్డే జయమ్మ, కంబగిరి, భీమ లింగ, హసన్‌వలి, మహమ్మద్, కంబగిరితో పాటు మరో నాలుగు కుటుంబాలు ఉన్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారుజామునే పింఛన్లు అందిస్తున్నారన్నారు. ఇంత వరకు ఏ ముఖ్యమంత్రి ఇలాంటి పథకాలు చేపట్టలేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే 50 శాతం నామినేటెడ్ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేటాయించామన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట రామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్‌బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ కొట్టే వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నప్ప, నాయకులు దండు రాముడు, నాగేష్, చలమారెడ్డి, సుబ్బారెడ్డి, రాగుల వెంకటరామిరెడ్డి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఏ కష్టమొచ్చినా పార్టీ అండగా ఉంటుంది


బాధితుడికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: తాడిపత్రి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎలాంటి కష్టమొచ్చినా పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన చీమలవాగుపల్లిలో దుండగులు నిప్పు పెట్టడంతో కంది పంట నష్టపోయిన కార్యకర్త రంగయ్యను పరామర్శించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బాధితుడికి రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు.

జగనన్న పాలనలో పేదల జీవితాల్లో వెలుగులు

తాడిపత్రి అర్బన్: జగనన్న పాలనలో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని ఓంశాంతి నగర్‌లో పర్యటించారు. కాలనీలోని ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలన్నీ నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేసిన గొప్ప రాజకీయ దార్శనికుడని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి వైఎస్.జగన్‌ను తిరిగి సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ రాబర్ట్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జావిద్‌ఖాద్రీ, నాయకులు కొనిసేపల్లి నరసింహారెడ్డి, డివి.కుమార్, సూర్యప్రభాకర్‌బాబు, జిలాన్, అయూబ్ తదితరులు ఉన్నారు.

రవీంద్రారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు


మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి, నాయకులు

యల్లనూరు: వైఎస్సార్‌సీపీ నేత రవీంద్రారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బెంగళూరులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవీంద్రారెడ్డి(50) సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మంగళవారం ఆయన దంతలపల్లికి చేరుకొని రవీంద్రారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చరు. రవీంద్రారెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని సాంబశివారెడ్డి భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి పురుషోత్తంనాయుడు, నాయకులు దంతలపల్లి బాలవెంకటరెడ్డి, రాజారెడ్డి, పెద్దిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనకు సమష్టి కృషి


పెద్దవడుగూరు మండలం కిష్టిపాడులో మందులు అందిస్తున్న దృశ్యం

యాడికి: కుష్టు వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి అవసరమని వైద్యుడు పరమేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం కుష్టు నివారణపై మంగళశారం అవగాహనతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పరమేశ్వర్ మాట్లాడుతూ శరీరంపై తెల్లని, రాగి రంగులో మచ్చలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. మండలంలోని గ్రామాల్లో 15రోజుల పాటు కుష్టు పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గార్లదిన్నె: కుష్టు నిర్మూలన పక్షోత్సవాలు విజయవంతం చేయాలని పీహెచ్‌సీ డాక్టర్లు మంజుల, పద్మావతి, దిలీప్‌కుమార్ సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందికి మంగళవారం కుష్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల 13 వరకు కుష్టు నిర్మూలన పక్షోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఆయా గ్రామాల్లో పర్యటించి కుష్టు బాధితులను గుర్తించి మండల వైద్యాధికారికి రెఫర్ చేయాలన్నారు. సీహెచ్‌ఓ లోక్‌నాథ్, ఆరోగ్యవిస్తరణ అధికారి నాగేశ్వరయ్య, పీహెచ్‌ఎన్ అరుణ, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: ప్రజలు కుష్టు నివారణపై అవగాహన కలిగి ఉండాలని క్రిష్టిపాడు ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీనివాసులరెడ్డి, మహిళ వైద్యురాలు త్రివేణి పేర్కొన్నారు. మంగళవారం క్రిష్టిపాడు గ్రామంలో కుష్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్టు బాధితులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్‌ఈఓ కంబగిరిస్వామి, ఎంఎల్‌హెచ్‌పీ లిఖిత సాయి, ఆశా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా పెద్దమ్మ బోనాల పండుగ

గార్లదిన్నె: మండల కేంద్రంలో మంగళవారం గ్రామస్తులు పెద్దమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో మహిళలందరూ డప్పు వాయిద్యాల నడుమ పెద్దమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో వన భోజనం

పెద్దపప్పూరు: మండల కేంద్రంలో వన భోజనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధనుర్మాసం ముగిసిన సందర్భంగా శ్రీకృష్ణదేవాలయ భజన బృందం సభ్యులు మంగళవారం పెన్నానది సమీపంలోని మామిడి వనంలో బాలకృష్ణుడి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామికి పిండి వంటలు చేసి నైవేద్యంగా సమర్పించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

పెద్దవడుగూరు : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమల్లో ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆర్బీకే ద్వారా రైతులు పండించిన పంట జొన్నలు, కొర్రలు, కందులు కొనుగోలు చేస్తామని ఏఈఓ రజిని తెలిపారు. మండలంలోని పాడి రైతులకు ఉపాధి హామీ ద్వారా పశువుల షెడ్డు నిర్మాణానికి దరఖాస్తులు స్వీకరిస్తామని వెటర్నరీ డాక్టర్ కమల తెలిపారు. ఎంఈఓ రాముడు, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తి నష్టం

గుంతకల్లు రూరల్: చింతలాంపల్లిలో ఓ ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తినష్టం వాటిల్లింది. వివరాలు. గ్రామానికి చెందిన జెట్టీ ఆదెప్ప అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం ఉదయం భార్య నాగలక్ష్మితో కలిసి దోనిముక్కలలో మిరప పంట కోతకు వెళ్లాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో మంటలు చేలరేగాయి. గమనించిన స్థానికులు ఇంటి తాళం పగులగొట్టి మంటలు ఆర్పేందుకు యత్నించారు. అప్పటికే ఇంట్లో వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. కంది పంట అమ్మగా వచ్చిన రూ.1.8 లక్షల నగదు కూడా కాలిపోయింది. ఘటనలో రూ.4 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

వ్యక్తికి తీవ్రగాయాలు

గుత్తి రూరల్: ఊబిచెర్ల శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఊబిచెర్లకు చెందిన నడిపన్న గుత్తిలో పని ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. గ్రామ శివారులో వెనుక నుంచి కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నడిపన్నను వెంటనే స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అనంతపురం తీసుకెళ్లారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

యాడికి: మండల కేంద్రంలోని కుంటకు చెందిన బోయ చిన్నయ్య అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి

నార్పల:మండల కేంద్రంలోని సుల్తాన్ పేట కాలనీ వద్ద మంగళవారం సాయంత్రం బైక్ ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాలు.. సుల్తాన్‌పేటకు చెందిన రామలక్ష్మమ్మ(60) నిత్యవసరాలు కొనుగోలు చేయడానికి కిరాణషాపు వద్దకు వెళుతుండగా షేక్ హుస్సేన్ అనే యువకుడు బైక్‌పై అతి వేగంతో వచ్చి ఆమెను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే ఆమె అప్పటికే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు. మృతురాలి కుమారుడు సుదర్శనరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.